RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్
సంపుటి : 4, సంచిక : 28

గురువారం
జనవరి 01, 2026

పేజీలు : 6
వెల : రూ.3-00



## పట్టాదారు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి

4లో..

- యువతకు వ్యసనంగా సామాజిక మాధ్యమం
- స్కిల్స్ కు వేదికే.. అయినా రీల్స్ మోజులో సోమరితనం
- ప్రపంచాన్ని కదిలిస్తున్న మొబైల్ శక్తి
- కొత్తరకం చెడు వ్యసనాలు, సైబర్ క్రైమ్స్‌కు దారి
- రాజకీయాల్లోనూ సోషల్ మీడియాదే అగ్రస్థానం
- రెండు వైపులా తేనె పూసిన కత్తిలా పనితీరు

3లో..



# 'సోషల్' మత్తు!

☐ నూతన సంవత్సరం వేళ సరికొత్త ఆలోచనలు అవసరం ☐ మంచి కోసం మనం మారుదాం..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

ప్రస్తుతం ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూనే తిరుగుతోందనడం అతిశయోక్తి కాదు. వార్తలు, వ్యాపారం, విద్య, రాజకీయాలు, వినోదం... మన జీవితంలోని ప్రతి కోణాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన వ్యవస్థగా సోషల్ మీడియా మారింది. ఈ భూ ప్రపంచంలో మన ఆలోచనలను అత్యంత వేగంగా మార్చగల శక్తి ఏదైనా ఉందంటే అది సోషల్ మీడియానే. కానీ అదే సమయంలో ఇది రెండువైపులా తేనె పూసిన కత్తి లాంటిది. బాధ్యతతో, వివేకంతో వాడితే జ్ఞానానికి, అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలానికి దోహదపడుతుంది. అదే నిర్లక్ష్యంగా, ఆలోచన లేకుండా వాడితే అబద్ధాలు, ద్వేషం, అలసత్వం, మానసిక ఒత్తిడి, సామాజిక విభజనలకు కారణమవుతుంది. మన చేతిలో ఉన్న ఒక మొబైల్ ఫోన్ సమాజాన్ని మార్చగల శక్తిని కలిగి ఉంది అన్నది నిజం. అందుకే ఈ నూతన సంవత్సరం నుంచైనా సోషల్ మీడియాను కాలక్షేపానికి, చెడు ప్రచారాలకు, అప్రయోజనాలకు కాకుండా జ్ఞానం పెంచుకునే వేదికగా, స్కిల్స్ నేర్చుకునే సాధనంగా, సానుకూల ఆలోచనలు పంచే మాధ్యమంగా మార్చుకోవాలి. మనం మారితేనే వేదిక మారుతుంది. సోషల్ మీడియా మనపై ఆధిపత్యం చెలాయించకుండా, మనమే దాన్ని నియంత్రించే స్థాయికి చేరుకోవడమే ఈ కాలానికి అవసరమైన మార్పు.

## నేత కార్మికులకు తీవ్ర అన్యాయం

- సంక్రాంతిలోపు వర్కర్ టు ఓనర్ లబ్ధిదారులు ప్రకటించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల అపారెల్ పార్క్ పరిశీలన



**వేద న్యూస్, సిరిసిల్ల:**

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సిరిసిల్లలోని నేత కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో అపారెల్ పార్క్‌కు రెండు పరిశ్రమలు తీసుకువచ్చామని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాలేదని కేటీఆర్ విమర్శించారు. 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే ఈ అపారెల్ పార్క్‌ను మిగతా 3వ పేజీలో..

## అర్ధరాత్రి ఒంటి గంట వరకే అనుమతి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- న్యూ ఇయర్ వేడుకలపై హైదరాబాద్ పోలీసుల కఠిన ఆంక్షలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**




నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు కాపాడే దిశగా పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించిన ఈవెంట్లకు అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని సీపీ సజ్జనర్ తెలిపారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత సంగీత కార్యక్రమాలు, పార్టీలకు అనుమతి ఉండదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని అరికట్టేందుకు రాత్రి 7 గంటల నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని చెప్పారు. నగరవ్యాప్తంగా కీలక కూడళ్లలో ప్రత్యేక తనిఖీ బృందాలను మోహరిస్తామని, మద్యం మత్తులో వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని, అయితే చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు విడుదల



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

- రూ.713 కోట్లు రిలీజ్ చేసిన సర్కార్ డిసెంబర్ నెల బకాయిలు చెల్లింపు

డిసెంబర్ నెలకు సంబంధించి గ్రాట్యుటీ, సాధారణ భవిష్య నిధి, సరెండర్ లీవ్ నగదీకరణ, అడ్వాన్సుల బకాయిల చెల్లింపుల కోసం రూ.713 కోట్లను విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అధికారులు తెలిపారు. ఈ నిధుల విడుదలతో ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న బకాయిల సమస్యకు కొంతమేర ఉపశమనం లభించిందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతి నెలా రూ.700 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## మళ్లీ ఉద్యమం చేయాల్సి వస్తుంది

- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- 250 గజాల స్థలం వెంటనే ఇవ్వాలి
- కమిటీలతో కాలయాపన వద్దు
- ఎక్కడికక్కడ భూములు ఆక్రమించుకోవాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- తెలంగాణ ఉద్యమకారులతో కలిసి భూ పోరాటం




3లో..

## దిగొచ్చిన బంగారం, వెండి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**



సంవత్సరం చివరి రోజున దేశీయ మార్కెట్లో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది. ఉదయం సమయానికి ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర 1,36,340 రూపాయలకు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో అదే పరిమాణం బంగారం ధర 1,36,190 రూపాయలుగా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా ప్రధాన నగరాల్లో స్వల్పంగా తగ్గింది. ఢిల్లీలో 1,24,990 రూపాయలు ఉండగా, ముంబై, చెన్నై, హైదరాబాద్‌లలో 1,24,840 రూపాయల వద్ద ట్రేడైంది. దేశీయంగా పెట్టుబడిదారుల లాభాల స్వీకరణ, అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న మార్పుల ప్రభావంతో బంగారం ధరలు కాస్త తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర 4,401.59 డాలర్ల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది మొత్తం మీద బంగారం మంచి రాబడులు ఇచ్చినప్పటికీ, సంవత్సరాంతంలో మాత్రం కొంత సవరణ చోటుచేసుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక వెండి ధరల్లోనూ పతనం కనిపించింది. డిసెంబర్ 31 ఉదయం కిలో వెండి ధర 2,39,900 రూపాయలకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ఔన్స్ ధర 75.85 డాలర్లుగా ఉంది. పరిశ్రమల అవసరాలు, దీర్ఘకాల పెట్టుబడులపై ఆసక్తి వల్ల వెండికి మద్దతు కొనసాగుతున్నప్పటికీ, తక్షణ లాభాల స్వీకరణ కారణంగా ధరల్లో ఈ తగ్గుదల కనిపిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

## జానారెడ్డిని పరామర్శించిన సీఎం

- మోకాలి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్
గురువారం జనవరి 01, 2026

# కదిలే వ్యాన్‌లో సామూహిక అత్యాచారం

- అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల పాటు హింస
- కదులుతున్న వాహనం నుంచి బాధితురాలి తోసివేత
- హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఘటన

**వేద న్యూస్, ఫరీదాబాద్ ప్రతినిధి:**

హర్యానాలోని ఫరీదాబాద్‌లో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న వ్యాన్‌లో 28 ఏళ్ల యువతిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘాతుకం జరగగా, మంగళవారం తెల్లవారుజామున ఆమెను వాహనం నుంచి బయటకు తోసేశారు. పోలీసుల కథనం ప్రకారం, బాధిత మహిళ సోమవారం రాత్రి ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం వేచి చూస్తుండగా ఓ వ్యాన్ ఆమె వద్ద ఆగింది. ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి ఇద్దరు యువకులు ఆమెను వాహనంలోకి ఎక్కించుకున్నారు. అనంతరం వ్యాన్‌ను గుర్గావ్ రోడ్డువైపు మళ్లించి, సుమారు రెండున్నర గంటల పాటు ఆమెపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఎంత వేడుకున్నా వినిపించుకోకుండా బెదిరింపులకు దిగినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఎస్‌జీఎమ్ నగర్‌లోని రాజా చౌక్ సమీపంలో కదులుతున్న వ్యాన్ నుంచి ఆమెను బయటకు తోసేశారు. దీంతో ఆమె ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి



రక్తస్రావంతో ఉన్న బాధితురాలు తన సోదరికి సమాచారం ఇవ్వగా, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె ముఖానికి 10 నుంచి 12 కుట్లు వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, తీవ్ర మానసిక షాక్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బాధితురాలికి వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారని, భర్తతో విభేదాల కారణంగా కొంతకాలంగా వేరుగా ఉంటోందని పోలీసులు తెలిపారు. ఘటనకు ముందు రోజు రాత్రి తల్లితో గొడవపడి స్నేహితురాలి ఇంటికి వెళున్నట్లు ఆమె సోదరికి సమాచారం ఇచ్చినట్లు వెల్లడైంది. బాధితురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, నేరానికి ఉపయోగించిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు పూర్తిగా కోలుకున్న తర్వాత ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.




# లైంగిక బాధితులకు 'భరోసా'



- అలాంటి వారికి మానసిక స్థైర్యం అందించాలి
- పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలి
- అదనపు ఎస్పీ మహేందర్
- భరోసా సెంటర్ సందర్శన

**వేద న్యూస్, మెదక్ జిల్లా**

లైంగిక వేధింపులకు గురైన బాలికలు, మహిళలకు భరోసా సెంటర్ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, పోక్సో కేసులు, లైంగిక అత్యాచారాలకు గురైన మహిళలు, పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన బాలలు, మహిళల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారికి సామాజిక అభద్రతా భావం కలగకుండా ధైర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు ఎప్పటికప్పుడు న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక బలం అందించడంతో పాటు పోక్సో చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. వేధింపులు, అత్యాచారం, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించే ఉద్దేశంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు మనోధైర్యం కల్పించే విధంగా అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. లైంగిక వేధింపులకు గురైన వారు భయ పడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించి చట్టాలు మరింత బలోపేతం చేయబడ్డాయని, లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఎస్ఐ సూచిత, భరోసా కో ఆర్డినేటర్ సౌమ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసమే షీ టీమ్స్

- వేధింపులకు పాల్పడతే కేసులు తప్పవు
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్స్ పటిష్టంగా పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. డిసెంబర్ నెలలో ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన వారిపై 02 ఎఫ్ఐఆర్‌లు, 07 ఈ- పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రెడ్ హ్యాండ్‌గా తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 16 మంది, మెదక్ సబ్‌డివిజన్‌లో 48 మంది మొత్తం 64 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, బస్ స్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో 38 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా మహిళలను లేదా బాలికలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్-100 లేదా షీ-టీమ్ వాట్సాప్ నంబర్ 8712657963 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండకముందే బాలికల వివాహాలు జరిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మెదక్ జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రారంభించామని, మనుషుల అక్రమ రవాణా లేదా ఆర్గనైజ్డ్ నేరాలపై సమాచారం అందించాలని తెలిపారు. షీ-టీమ్స్ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో షీ-టీమ్ సిబ్బంది ఏఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు ప్రమీల, విజయ్, స్వరూప, గంగామణి, హెచ్‌జీలు విజయ రాణి, సురేష్ కుమార్ తమ తమ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నారు.

# గ్రామ సమస్యలపై బండి సంజయ్ కి వినతి

**వేద న్యూస్, బోయినిపల్లి:**



గ్రామ సమస్యలు పరిష్కరించడంతో పాటు, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, బోర్లు, ఓపెన్ జీమ్ ఏర్పాటు గురించి కొదురుపాక గ్రామ సర్పంచ్ కత్తరపాక మంజుల సుధాకర్, గ్రామ వార్డు మెంబర్స్, గ్రామ ప్రజలు, యువకులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం బండి సంజయ్ కుమార్ కు సన్మానించారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అన్నళదాసు భాస్కర్, నాగుల రవి వర్మ, బండి శ్రీను, సంజీవ్ రావు, నాగుల వంశీ, సత్యనారాయణ రావు, సందిల దేవయ్య, నాగుల నాగరాజు, తిరుపతి, దేవరాజు, సూరత్ శ్రీను, సారాంపల్లి రాజు, కొండల్ రావు, అంజయ్య, బలాగోని శ్రీను, అనిల్, సట్ట తిరుపతి పాల్గొన్నారు.

# దామరచర్లలో అర్ధరాత్రి వాహనాల తనిఖీ

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించి నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నాలుగు వాహనాలు పట్టుబడ్డట్లు చెప్పారు. వాటిలో ఒక కారు, 3 ద్విచక్ర వాహనాలు ఉండగా వాటిని వెంటనే సీజ్ చేసినట్లు చెప్పారు. బుధవారం కూడా సాయంత్రం నుంచి వాహనాల తనిఖీ నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

# చైనా మంజా పూర్తిగా నిషేధం

- విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు
- ఈ దారంతో ఎంతో ప్రమాదకరరొ సిరిసిల్ల
- ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

జిల్లా పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మంజా విక్రయం, వినియోగం పూర్తిగా నిషేధించబడిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా లేదా వినియోగించినా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో యువత గాలిపటాలను ఎగరవేయడానికి సిద్ధమవుతున్న వేళ, కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారైన చైనా మంజా మనుషులకు, వాహనదారులకు తీవ్ర ప్రమాదం కలిగించడమే కాకుండా పక్షులకు ప్రాణాంతకంగా మారుతున్నదని, అలాగే పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు జిల్లాలో చైనా మంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా చైనా మంజా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ చైనా మంజా వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, ఎవరికీ హాని కలగని సాధారణ కాటన్ దారంతోనే గాలిపటాలను ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అలాగే ఎవరైనా చైనా మంజాను విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే డయల్100 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# చిరుత సంచారం..



**వేద న్యూస్, వేములవాడ:**

గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గమనించిన స్థానికులు భయాందోళనలో గడుపుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల పరిధిలోని హనుమాజీపేట గ్రామంలో చిరుత పులి సంచారంతో వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి ఆ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. అక్కడ లభ్యమైన పాదముద్రలను పరిశీలించగా అవి చిరుత పులివేనని అధికారులు అధికారికంగా ధృవీకరించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలోని రుద్రంగి, మరిమడ్ల, వట్టిమల్ల గ్రామాల పరిసరాల్లో సంచరించిన చిరుత ఇప్పుడు హనుమాజీపేట పరిసరాలకు చేరుకోవడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు.

# నిరుపేద కుటుంబానికి చేయూత

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలం సోమగూడెం కె గ్రామపంచాయతీ పరిధిలోని ట్యాంక్ బస్తిలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన కర్రే శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ సూచన మేరకు, మృతుని కుటుంబానికి సంస్థ తరపున సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 29వ సేవా కార్యక్రమమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే సీనియర్ ఆఫీసర్ పందిళ్ళ ప్రభాకర్ రెడ్డి, సర్వే ఆఫీసర్ మహబూబ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అంకం రాయమల్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, చైర్మెన్ విజయ్, అసిస్టెంట్ చైర్మెన్లు కాంద్రపు రవి, జూల పోషం, కస్తూరి సందీప్ పాల్గొన్నారు. అలాగే సర్వే మజ్దూర్లు దాగం ఆనంద్, మోహన్, కుమారస్వామి, దువ్వల ప్రవీణ్, బండి గణేష్, మేకల ఆంజనేయులు, షకీల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- యువతకు వ్యసనంగా సామాజిక మాధ్యమం
- స్కిల్స్ కు వేదికే.. అయినా రీల్స్ మోజులో సోమరితనం
- ప్రపంచాన్ని కదిలిస్తున్న మొబైల్ శక్తి
- కొత్తరకం చెడు వ్యసనాలు, సైబర్ క్రైమ్స్‌కు దారి
- రాజకీయాల్లోనూ సోషల్ మీడియాదే అగ్రస్థానం
- రెండు వైపులా తేనె పూసిన కత్తిలా పనితీరు



# 'సోషల్' మత్తు!

☐ నూతన సంవత్సరం వేళ సరికొత్త ఆలోచనలు అవసరం ☐ మంచి కోసం మనం మారుదాం..



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

సోషల్ మీడియా ఇప్పుడు కేవలం వినోద వేదిక కాదు. అది మన ఆలోచనలను, నిర్ణయాలను, సంబంధాలను, చివరికి ప్రజాస్వామ్య భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే శక్తివంతమైన వ్యవస్థగా మారింది. ఒకప్పుడు ప్రజల గొంతు వినిపించాలంటే మీడియా సంస్థలు, రాజకీయ వేదికలు అవసరమయ్యేవి. ఇప్పుడు ఒక మొబైల్ ఫోన్, ఒక అకౌంట్ ఉంటే చాలు. సామాన్యుడి మాట కూడా క్షణాల్లో లక్షల మందికి చేరుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి బలం అని చెప్పేవారు ఉన్నారు. అదే సమయంలో ఇదే వేదిక ప్రజాస్వామ్యాన్ని లోపల్నుంచి బలహీనపరుస్తోందని హెచ్చరించే స్వరాలు కూడా వినిపిస్తున్నాయి.

**- మంచి, చెడు కలయికగా..**

సోషల్ మీడియా ప్రజలకు మాట్లాడే అవకాశం ఇచ్చింది. అన్యాయం జరిగితే వెంటనే బయటపడుతోంది. పాలకుల తప్పులు ప్రశ్నించబడుతున్నాయి. ఒక మారుమూల గ్రామంలో జరిగిన ఘటన దేశవ్యాప్తంగా చర్చకు వస్తోంది. అధికారంలో ఉన్నవారికి ప్రజల ఆగ్రహం నేరుగా చేరుతోంది. ఈ కోణంలో చూస్తే సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి. అయితే అదే సమయంలో నిజం, అబద్ధం మధ్య తేడా లేకుండా సమాచారం వైరల్ అవుతోంది. ధృవీకరణ లేకుండా ప్రచారం జరుగుతోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు క్షణాల్లో లక్షల మందికి చేరుతు న్నాయి. ఆలోచించకుండా నమ్మే పరిస్థితి పెరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి అవసరమైన వివేకాన్ని దెబ్బతీస్తోంది.

**- సోషల్ మీడియా మత్తులో యువత**

యువ భారతం సోషల్ మీడియా మత్తులో చిక్కుకుపోతున్నదన్న ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. వార్తలను చదివి విశ్లేషించాల్సిన వయసులో షార్ట్ వీడియోలు, హెడ్‌లైన్లకే పరిమితమవుతున్నారు. లోతైన ఆలోచన తగ్గుతోంది. భావోద్వేగాల ఆధారంగా అభిప్రాయాలు, నిర్ణయాలు తీసుకునే పరిస్థితి పెరుగుతోంది. ఇదే ధోరణి కొనసాగితే రేపటి ప్రజాస్వామ్యానికి ఇది పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది.

**- మంచి వేదిక.. అయినా సోమరితనం..**

సోషల్ మీడియా ఒక గొప్ప అవకాశాన్ని కూడా ఇస్తోంది. స్కిల్స్ నేర్చుకునేందుకు, జ్ఞానం పెంచుకునేందుకు, ప్రపంచంతో పోటీ పడేందుకు ఇదొక అద్భుత వేదిక. కానీ అదే సమయంలో ఎక్కువమంది యువత వినోదం, రీల్స్, లైక్స్, ఫాలోవర్ల మత్తులో పడి నిజమైన అభివృద్ధిని విస్మరిస్తున్నారు. నేర్చుకోవాల్సిన వయసులో కాలక్షేపానికి పరిమితమై, శ్రమకు దూరమవుతూ సోమరులుగా మారుతున్నామన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**- చెడు వ్యసనాలు, క్రైమ్స్‌కు దారి..**

సోషల్ మీడియా మరో ప్రమాదకర రూపంలో యువతను కొత్తరకం చెడు వ్యసనాలు, నేరాల వైపు నడిపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, ద్వేష ప్రచారాలు.. ఇవన్నీ సోషల్ మీడియా వేదికగా పెరుగుతున్నాయి. వర్చువల్ ప్రపంచంలో మొదలైన ద్వేషం, అసహనం నిజ జీవితంలో హింసగా మారుతున్న ఉదాహరణలు పెరుగుతున్నాయి.

**- రాజకీయాల్లో ప్రచారమే రాజ్యం**

రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రభావం మరింత పెరిగింది. ఎన్నికల సమయంలో అభివృద్ధి చర్చలకన్నా ప్రచారమే కీలకంగా మారుతోంది. ట్రోలింగ్, వ్యక్తిగత దాడులు, భిన్నాభిప్రాయాలపై దాడులు సాధారణమయ్యాయి. ఒక అభిప్రాయం చెప్పినవారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం, భయపెట్టడం పెరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం.

- విడగొట్టే ఆయుధంలా..

సోషల్ మీడియా ప్రజలను కలిపే వేదికగా ఉండాల్సిన చోట, కులం, మతం, ప్రాంతం పేరుతో విడగొట్టే ఆయుధంగా మారుతోందన్న విమర్శలు పెరుగుతున్నాయి. అబద్ధ ప్రచారాలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. మాటల యుద్ధం ద్వేషంగా మారుతోంది. భిన్న అభిప్రాయాల సహజీవనమే ప్రజాస్వామ్య బలం. కానీ సోషల్ మీడియా ఆ సహజీవనాన్ని కష్టతరం చేస్తోంది.

**- సమస్యంతా వినియోగంలోనే..**

ఇక్కడ అసలు సమస్య సోషల్ మీడియాలో ఉందా లేదా అన్నది కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే కీలకం. నియంత్రణ లేకుండా వదిలేస్తే అది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. అవగాహన, బాధ్యతతో ఉపయోగిస్తే అదే ప్రజాస్వామ్యానికి రక్షణగా మారుతుంది. నియంత్రణ పేరుతో గొంతు నొక్కేయకూడదు. స్వేచ్ఛ పేరుతో అబద్ధాలను వదిలేయకూడదు. మొత్తంగా సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి శత్రువా, మిత్రుడా అన్నది దాని స్వభావంపై కాదు.. మన చేతుల్లోనే ఉంది. నిజాన్ని నిలబెట్టే ఆయుధంగా మార్చుకుంటామా? లేక ద్వేషాన్ని పెంచే సాధనంగా వాడుకుంటామా?

# మళ్లీ ఉద్యమం చేయాల్సి వస్తుంది

**వేద న్యూస్, కరీంనగర్ :**

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా మళ్లీ ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి నిర్వహించిన భూ పోరాట కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కరీంనగర్ గడ్డపై జరిగే ప్రతి పోరాటం విజయవంతమవుతుందని, ఉద్యమకారుల కోసం చేపట్టిన ఈ భూ పోరాటం కూడా తప్పకుండా సక్సెస్ అవుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలం కేవలం కరీంనగర్‌లోనే కాదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అందే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భూముల విలువ ఎక్కువగా ఉన్నా, అక్కడ కూడా ఉద్యమకారుల హక్కుల కోసం వెనక్కి తగ్గేది లేదన్నారు. ఉద్యమకారుల చెమట, త్యాగాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఎవరో పోరాడితే తెలంగాణ రాలేదని కవిత గుర్తు చేశారు. బతుకమ్మ, బోనం, వంట వార్పు వంటి ఉద్యమాల ద్వారా తెలంగాణ కోసం పోరాడామని, రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అనేక అవమానాలు భరించామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల మద్దతుతో అధికారంలోకి వచ్చి పెన్షన్, సంక్షేమ బోర్డు, 250 గజాల స్థలం ఇస్తామని హామీలు ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు. కనీసం ఉద్యమకారులను గౌరవించి శాలువాతో సన్మానించే పరిస్థితి కూడా లేదన్నారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చలేదని, 1200 మంది అమరులైతే కేవలం 540 కుటుంబాలకు మాత్రమే కొంత మేలు జరిగిందని తెలిపారు. జూన్ 2, ఆగస్టు 15, జనవరి 26 వంటి ముఖ్యమైన రోజుల్లో కూడా ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను గౌరవించలేదని విమర్శించారు. ఇప్పుడు ఉద్యమకారులంతా ఒకే ఫోరంగా ఏర్పడిన నేపథ్యంలో ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. తెచ్చుకున్న తెలంగాణలో ఆత్మగౌరవంతో పాటు తమ వాటా మాత్రమే కోరుతున్నామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలైన పెన్షన్, సంక్షేమ బోర్డు, 250 గజాల స్థలం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ వ్యతిరేకులు ఉద్యమ పార్టీల్లోకి వచ్చి ఉద్యమకారులపై పెత్తనం చెలాయిస్తూ కేసులు పెట్టారని, సెక్రటేరియేట్‌కు వెళ్లినప్పుడు కూడా అవమానించారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన డేటా ఆధారంగానే ఉద్యమకారులను గుర్తించాలని, అదే డేటాను సీఎం కార్యాలయం ముందు ఉంచుతామని తెలిపారు. పోరాటాల ద్వారానే తెలంగాణను తెచ్చుకున్నామని, ఐదు ఎకరాల భూమి తెచ్చుకోవడం పెద్ద విషయం కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు శాంతియుతంగా పోరాటం కొనసాగుతుందని, ఎక్కడికక్కడ భూములను ఆక్రమించుకోవాలని ఉద్యమకారులకు కవిత పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు లకవత్ రూప్ సింగ్, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అక్కం శివరాణి, యండి సల్మ, జంగ అపర్ణతో పాటు జాగృతి, ఉద్యమకారుల ఫోరం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూట్యూబర్ అన్వేష్‌పై కేసులు..

- సనాతన ధర్మంపై వ్యాఖ్యలే కారణమని ఫిర్యాదు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రముఖ యూట్యూబర్ నా అన్వేషణ ఛానల్ నిర్వాహకుడు అన్వేష్ పై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సనాతన ధర్మం, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అభ్యంతరకర కంటెంట్‌ను యూట్యూబ్‌లో ప్రసారం చేశారని ఆరోపిస్తూ కరాటే కళ్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన అన్వేష్ విదేశాల్లో పర్యటిస్తూ ట్రావెల్, లైఫ్‌స్టైల్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించిన కంటెంట్‌ను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసారం చేస్తూ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందాడు. అయితే ఇటీవల హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్వేష్ వ్యా ఖ్యలపై పలువురు ఆయ న ఛానల్‌ను అన్‌సబ్‌స్క్రైబ్ చేస్తూ, వీడి యోలను రిపోర్ట్ చేస్తు న్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఖమ్మం జిల్లా దానవాయిగూడేనికి చెందిన జి. సత్య నారాయణరావు ఆదివారం రాత్రి పోలీసుల కు ఫిర్యాదు చేయగా, ఖానాపురంహవేలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా కరాటే కళ్యాణి ఫిర్యాదుతో హైదరాబాద్‌లో మరో కేసు నమోదు కావడంతో, అన్వేష్‌పై న్యాయపరమైన చర్యలు మరింత పెరుగుతున్నాయి.



# నేత కార్మికులకుతీవ్ర అన్యాయం

తాము ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. సంక్రాంతి లోపు వర్కర్ టు ఓనర్ పథకం లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే 10 వేల మందితో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. తమ ప్రభుత్వం ఉన్న సమయంలో నేత కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, రూ.400 కోట్ల వ్యయంతో అపారెల్ పార్క్‌ను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అపారెల్ పార్క్ అభివృద్ధిపై ఎలాంటి శ్రద్ధ చూపలేదని, కార్మికుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. నేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# జానారెడ్డిని పరామర్శించిన సీఎం



మాజీ మంత్రి జానారెడ్డిను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన నివాసంలో పరామర్శించారు. జానారెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయన కోలుకుంటున్న తీరుపై వైద్యులు ఇచ్చిన సూచనలను కూడా సీఎం అడిగి తెలుసుకున్నారని సమాచారం. జానారెడ్డి త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జానారెడ్డి సేవలను సీఎం ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగిందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# మృతుల కుటుంబాలకు చేయూత



**వేద న్యూస్, శాయంపేట:**

కాట్రపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పిట్టల సమ్మయ్య, ఏనుగు మోహన్, పాటి రాజమౌళి కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి బాధిత కుటుంబాలకు రూ. 2వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంఘాల ఎలీషా, గ్రామ ఉప సర్పంచ్ సంఘాల బిక్షపతి, పోలు అశోక్, మాజీ ఎంపీటీసీ షేక్ గౌస్, మాజీ సర్పంచ్ మందపల్లి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ అజ్మీర జాయ్, వార్డు సభ్యులు గోపరాజు చేరాలు లక్ష్మి, బొమ్మకంటి శాంతి కుమార్, తరాల చంద్రమౌళి, పార్టీ పెద్దలు సంఘాల మధు, ఏనుగు బాబు ,బురగోని రమేష్ , జనగాం శ్రీను ,గిద్దెమారి శ్రీను, ఒంటెరు ప్రసాద్, గట్టు రాజమౌళి, పండవుల రవి, సుదగాని బిక్షపతి, మీసరగాండ్ల రంజిత్, సంఘాల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించండి

**- ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో టీజీ టెట్ -2026లో భాగంగా జనవరి నెలలో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు అనుకూలంగా పరీక్షా కేంద్రాల కేటాయింపు జరగాలని, పరీక్షలకు హాజరయ్యే రోజులను ఆన్ డ్యూటీ (ఓడీ)గా పరిగణించాలని బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మాల్క కొమరయ్య ప్రభుత్వానికి లేఖ రాస్తూ కోరారు. దీనికి సంబంధించిన లేఖను ఎమ్మెల్సీ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించారు. ఈ ఏడాది జనవరి నెలలో నిర్వహించనున్న టెట్ పరీక్షలకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టెట్ నిర్వహించిన పలు సందర్భాల్లో ఉపాధ్యాయుల కు వారి పని చేసే ప్రాంతానికి దూరంగా పరీక్షా కేంద్రాలు కేటాయించడంతో, ప్రయాణ వ్యయ భారమే కాకుండా ఇటు పరీక్షకు హాజరై అటు అదే రోజున తమ విధులు నిర్వహించడం కష్టంగా మారుతోందని ఆ లేఖలో తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, టెట్ పరీక్ష రాసే ఉపాధ్యాయులకు అనుకూలంగా అదే జిల్లా లేదా సమీప ప్రాంతాల్లోనే పరీక్షా కేంద్రాలు కేటాయించాలని,వారికి ఆరోజు ఆన్ డ్యూటీగా పరిగణించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ మాల్క కొమరయ్య కోరారు. టెట్ పరీక్షను రాసే ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిశీలించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విద్యాశాఖ అధికారులను కోరారు.

# సమస్యల పరిష్కారానికై పిఆర్టియు టీఎస్ చిత్తశుద్ధితో పనిచేస్తుంది

**వేద న్యూస్, నల్లబెల్లి. :**

పిఆర్టియు టి ఎస్ నల్లబెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పి ఆర్ టి యు క్యాలెండర్ ను, టేబుల్ క్యాలెండర్ ను జడ్.పి.హెచ్.ఎస్ నందిగామ ఉన్నత పాఠశాలలో పి ఆర్ టి యు టి ఎస్ క్యాలెండర్ ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసిల్దార్ ముప్పు కృష్ణ, వరంగల్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ పాలకుర్తి విజయ్, పి ఆర్ టి యు టి ఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్, నల్లబెల్లి ఎంఈఓ అనురాధ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేసే సంఘం పి ఆర్ టి యుటిఎస్ అని అన్నారు. పాలకుర్తి విజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసి మండలంలో విద్యారంగా అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. నక్కిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ..రానున్న నూతన సంవత్సరములో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి కృషితో ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండ ల ఎంఈఓ శ్రీమతి అనురాధ , అంతర్జాతీయ మానవ హక్కుల వరం గల్ జిల్లా



మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర,మండల పిఆర్టియు టిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉడుత రాజేందర్, భానోత్ కృష్ణ ,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జే రామస్వామి, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ ,జాకీర్ హుస్సేన్, నందిగామ సర్పంచ్ భూక్య భాస్కర్ ఉపాధ్యాయులు వెంకటయ్య, సంధ్యా రాణి, సుచరిత, వెంకటకృష్ణ,సదాచారి తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం నుంచి పొందిన అనుభవాలను పునాదిగా చేసుకొని కొత్త లక్ష్యాలను నిర్ణయించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల వాతావరణం ఉత్సాహంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు సంతోష్, రాజు, రమేష్, తిరుపతి, శ్రీనివాస్, సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, షమీమా, స్వాతి, జలజ, శాంత, పద్మ, సునీతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నరేందర్ సేవలు గొప్పవి



**వేద న్యూస్, హన్మకొండ:**

- వివాద రహితుడిగా పేరున్న వ్యక్తి
- శేష జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలి
- హన్మకొండ న్యాయశాఖ ఉద్యోగులు, ప్రతినిధులు
- ఘనంగా జూ.అసిస్టెంట్ నరేందర్ పదవీ విరమణ వేడుక

హన్మకొండ న్యాయశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన ఊషకోయల నరేందర్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా హన్మకొండ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు వేడుకను నిర్వహించారు. తమ విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన నరేందర్ ను సహోద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో నరేందర్ కుటుంబసభ్యులు కూడా పాల్గొన్నారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. నరేందర్ అందించిన సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఎలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా, బాధ్యతాయుతంగా పని చేసిన ఉద్యోగిగా నరేందర్ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ, భవిష్యత్ జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా, ఆనందంగా సాగాలని పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజానికి సేవలందించే కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని సహోద్యోగులు, సంఘ సభ్యులు మనసారా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో నరేందర్ మాట్లాడుతూ.. తాను ఉద్యోగ నిర్వహణలో ఎప్పుడూ రాజీ పడలేదన్నారు. తన సహోద్యోగులు, పై అధికారుల సహకారం ఎంతో ఉందన్నారు. తనకు ఇన్నేళ్లు విధి నిర్వహణలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన కుటుంబ సభ్యుల సహకారం కూడా తనకు ఎల్లప్పుడూ ఉందని ఈ సందర్భంగా నరేందర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని నరేందర్ కు ఘనంగా వీడ్కోలు పలికారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**వేద న్యూస్, ముస్తాబాద్ :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన శంకర్ కుటుంబం రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురయ్యారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ నుంచి సెస్‌కు చెందిన మినీ గూడ్స్ వాహనం ట్రాన్స్‌ఫార్మర్‌ను లోడ్ చేసుకొని సిరిసిల్ల వైపు వెళ్తుండగా, అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నామాపూర్‌కు చెందిన శంకర్‌ను సెస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్‌తో పాటు అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన దంపతులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శంకర్ తలకు హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పినట్లు ఆయన తెలిపారు.

# పట్టాదారు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి

- ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావొద్దు
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పెద్దూర్ పీఏసీఎస్, సిరిసిల్ల ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్‌లో తనిఖీలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతుల పట్టాదారు పాస్‌పుస్తకం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్‌తో పాటు పెద్దూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ను ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లను, ఎరువుల స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని బస్తాల ఎరువులు విక్రయించారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. విక్రయించిన ఎరువులకు సంబంధించిన రైతుల పట్టాదారు పాస్‌పుస్తక వివరాలను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాపులు ఉదయం సమయానికే తెరవాలని, సాగు కాలానికి అనుగుణంగా ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగంతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజీనామా ఆమోదం

**వేద న్యూస్, చొప్పదండి గంగాధర:**



తన వ్యక్తిగత కారణాలతో చొప్పదండి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వొడ్నాల యజ్ఞేశ్ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి కి పంపించారు. రాష్ట్ర అధ్యక్షుని ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా ఇన్చార్జి పెద్దెల్లి తేజస్విని ప్రకాష్ రాజీనామాను ఆమోదించారు. ఈ సందర్భంగా కరీంనగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ మాట్లాడుతూ.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని, త్వరలోనే నూతన అధ్యక్షుడి ఎంపిక చేస్తామని తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల అధ్యక్షులు అనిల్, రామడుగు మండల అధ్యక్షుడు పరుశురాం గౌడ్, చొప్పదండి మండల అధ్యక్షుడు అఖిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు గోల్కొండ రాజు , అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ యాదవ్ మరియు దిలీప్ పాల్గొన్నారు.

# పులి గుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం



**వేద న్యూస్, ఖమ్మం:**

- అడవుల సంరక్షణలో వీఎస్ఎస్‌ల పాత్ర కీలకం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కల్లూరులో వీఎస్ఎస్ సమావేశ మందిరం ప్రారంభం

పులిగుండాల అటవీ ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కల్లూరు మండల పరిషత్తు ఆవరణలో నూతనంగా నిర్మించిన వన సంరక్షణ సమితుల సమావేశ మందిరాన్ని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. కనకగిరి, పులిగుండాల అటవీ ప్రాంతం సుమారు 35 వేల ఎకరాల్లో విస్తరించి ఉందని తెలిపారు. విదేశాల్లోని ప్రముఖ పర్యాటక కేంద్రాలకు దీటుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అపార అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు. అడవులను కాపాడుకుంటూనే స్థానిక గిరిజనులకు ఉపాధి, ఆదాయం కల్పించేలా ఎకోటూరిజం ప్రాజెక్టులను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వన సంరక్షణ సమితుల ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఒక సమితిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పులిగుండాల విహార యాత్ర కోసం రెండు వాహనాలను ప్రారంభించి, వీఎస్ఎస్ సమితి సభ్యులకు కుటీర పరిశ్రమల యూనిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్తో పాటు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి. ఎంపీని కలిసిన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

**వేద న్యూస్, టేక్మాల్:**



తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అవినాష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి, పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం అవినాష్ కుమార్ జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ ను కూడా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సమస్యలు, గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వినోద్, మహేష్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**అమరావతి, వేద న్యూస్:**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. బుధవారం తెల్లవారుజామున రాచర్ల రంగారెడ్డి పల్లె సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నంద్యాలఅమరావతి జాతీయ రహదారిపై తుని నుంచి జీడిపప్పు లోడుతో అనంతపురం వెళ్తున్న బొలెరో వాహనం, ముందుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ఢీకొన్న ఘటనలో బొలెరో వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనం నడుపుతున్న డ్రైవర్ స్వామి మంటల్లో చిక్కుకుని బయటపడలేక సజీవ దహనమయ్యాడు. అదే వాహనంలో ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో, అతడిని గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న రాచర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

- ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు
- నూతన సంవత్సర వేళ వేములవాడలో ముమ్మర తనిఖీలు



**వేద న్యూస్, వేములవాడ :**

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వేములవాడ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు డిసెంబర్ 31 సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచే విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బ్రిడ్జి ప్రాంతంతో పాటు ప్రధాన రహదారులపై వాహనదారులను ఆపి మద్యం సేవించారా లేదా అన్నదానిపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. వేడుకల పేరుతో మద్యం తాగి వాహనాలు నడిపితే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా కేసులు నమోదు చేస్తామని ఎస్సై సముద్రాల రాజు హెచ్చరించారు. ఉదయం నుంచి కొనసాగిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందిని గుర్తించి వారిపై చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, అతివేగం మరియు మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నాయని, అందుకే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తామని, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసే అవకాశం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నూతన సంవత్సరాన్ని సురక్షితంగా స్వాగతించాలని ఆయన కోరారు.

# శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

- తాగి రోడ్డెక్కితే కఠిన చర్యలు తప్పవు
- ఎవరూ నిబంధనలు ఉల్లంఘించొద్దు
- డీఎస్పీ నాగేంద్ర చారి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

డిసెంబర్ 31 వేడుకలను యువత శాంతియుతంగా జరుపుకోవాలని, ఇంటి వద్దనే సెలబ్రేట్ చేసుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి సూచించారు. రోడ్లపై తిరుగుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ , మద్యం తాగి వాహనాలు నడిపినట్లయితే కేవలం డ్రైవర్‌పైనే కాకుండా వాహనాన్ని ఇచ్చిన తల్లిదండ్రులు లేదా యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. యువతను రోడ్లపైకి రానివ్వ కుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు వేడుకలు జరుపుకోవచ్చని, కానీ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించరాదని సూచించారు. అలా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 'నేను ఎమ్మెల్యే కొడుకును, జెడ్పీటీసీ కొడుకును, మున్సిపల్ చైర్మన్ కొడుకును, సర్పంచ్ కొడుకును' అంటూ పలుకుబడి పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే, సాధారణ వ్యక్తుల కంటే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. నిబంధనలు అతిక్రమించినట్లయితే ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తప్పవని యువతకు డీఎస్పీ నాగేంద్ర చారి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

# పేదల ఇళ్లకు హైడ్రా భరోసా



- సర్వే నంబర్ 307 నివాసితులతో నేరుగా మాట్లాడిన కమిషనర్
- ప్రగతినగర్ చెరువు చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం

**హైదరాబాద్ వేద న్యూస్ :**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామం, సర్వే నంబర్ 307లో ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు హైడ్రా భరోసా ఇచ్చింది. ఇప్పటికే నివాసంలో ఉన్న పేదలను ఖాళీ చేయించబోమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లను మినహాయించి మిగిలిన ప్రభుత్వ భూమిని మాత్రమే కాపాడుతామని, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు.సర్వే నంబర్ 307లో నివసిస్తున్న పేదలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అక్కడి నివాసితులతో నేరుగా మాట్లాడి ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. నగరంలో ఎక్కడా పేదల నివాసాలను హైడ్రా తొలగించదని, హైడ్రా పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడితే నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే సమయంలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరగకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్లను మినహాయించేలా గాజులరామారంలో కంచె నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఇదే సందర్భంగా ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు పరిరక్షణ అంశంపై కూడా కమిషనర్ సమీక్షించారు. చెరువు మధ్య నుంచి సాగే రహదారికి ఇరువైపులా ఉన్న చిరువ్యాపారులకు వ్యాపారాలు సులభంగా సాగేలా ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించి తరలించాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల మేరకు చెరువు పరిసరాల్లో చెత్త గుట్టలను ఇప్పటికే సుమారు 150 లారీల మేరకు తొలగించినట్లు తెలిపారు.చేపలు, చికెన్, మాంసం వ్యర్థాలు చెరువులో కలవడంతో దుర్గంధం ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేయగా, చిరువ్యాపారులను ప్రత్యామ్నాయ స్థలాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఏసీపీ ఉమామహేశ్వర్‌తో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



**వేద న్యూస్, లింగల గణపురం:**

జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై లింగల గణపురం మండలం వడిచర్ల సమీపం లో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెంద గా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ బండి శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన సయ్యపురాజు, రాంప్రసాద్, లవ కుమార్, శరత్ కుమార్ రామగుండంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వడిచర్ల సమీపంలో జనగామ వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపిన సమయంలో, నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ డీసీఎంను గమనించకుండా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సయ్యపురాజు విష్ణువర్ధన్ అలియాస్ బబ్లు (32) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని వెంటనే జనగామ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# జీహెచ్ఎంసీ మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కొనసాగింపు

- మూడో రోజుకు చేరుకున్న విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం
- క్షేత్రస్థాయి తనిఖీలతో పనుల వేగవంతం



**హైదరాబాద్ వేద న్యూస్ :**

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ చేపట్టిన మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ మూడో రోజుకు చేరుకుంది. నగర పరిశుభ్రత, ప్రజారోగ్యాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరింత తీవ్రతరం చేసింది. వరుసగా మూడో రోజు కూడా నగరమంతా పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఈ డ్రైవ్‌లో భాగంగా రోడ్ల పక్కన, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్ల వెంట విస్తృతంగా శుభ్రత చర్యలు చేపట్టారు. చెత్త తొలగింపు, మురుగు శుభ్రపరిచే పనులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో కనిపించే చెత్త కుప్పలు పూర్తిగా తొలగించాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు.శంషాబాద్ జోన్ పరిధిలోని ఆదిబట్ల, కొంగర కలాన్, బొంగులూర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌తో కలిసి పారిశుద్ధ్య పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యవేక్షణ కఠినంగా ఉండాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని సూచించారు.రాబోయే రోజుల్లో సరస్సులు, నాలాలు, ఫుట్‌పాత్‌లు, పార్కుల శుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. అలాగే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉన్న చెత్తను క్లియర్ చేయడం వంటి పనులను కూడా ఈ డ్రైవ్‌లో భాగంగా చేపట్టనున్నారు. నిరంతర పర్యవేక్షణతో నగరంలో దీర్ఘకాలికంగా స్పష్టమైన పరిశుభ్రత మెరుగుదల సాధించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# నూతన సంవత్సరం ఆశలు, సంకల్పాలు, బాధ్యతలు

**వేద న్యూస్ డెస్క్:**

నూతన సంవత్సర దినోత్సవం అనగానే చాలా మందికి సంబరాలు, శుభాకాంక్షలు, కొత్త కలలు గుర్తుకు వస్తాయి. కానీ ఈ రోజు అసలు అర్థం సంబరాలకే పరిమితం కాదు. ఒక సంవత్సరం ముగిసి మరో సంవత్సరం మొదలవడం అనేది కేవలం క్యాలెండర్ మార్పు మాత్రమే కాదు. ఇది మన జీవితం ఎటు వెళ్తోంది? మన నిర్ణయాలు సరైన దిశలో ఉన్నాయా? అనే ప్రశ్నలను మనకే మనం వేసుకునే సందర్భం. ప్రతి నూతన సంవత్సరం మనకు ఇచ్చే మొదటి పాఠం ఇదేఆత్మపరిశీలన.గత ఏడాది మనందరికీ ఎన్నో అనుభవాలు నేర్పింది. కొందరికి విజయాలు, మరికొందరికి నష్టాలు, ఇంకొందరికి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఆర్థిక ఒత్తిళ్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు, పెరుగుతున్న జీవన వ్యయం ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి.

ఈ నేపథ్యంలో నూతన సంవత్సరం కేవలం ఆనందం మాత్రమే కాదు, గతం నుంచి పాఠాలు నేర్చుకుని మరింత జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన హెచ్చరిక కూడా.ప్రతి నూతన సంవత్సరం ఆరంభంలో తీసుకునే సంకల్పాలు చాలా గొప్పగా ఉంటాయి. ఆరోగ్యం, కుటుంబం, ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిగత అభివృద్ధి ఇలా అనేక లక్ష్యాలు మన ముందుకు వస్తాయి. అయితే సమస్య సంకల్పాల సంఖ్యలో కాదు, వాటి అమలులోనే ఉంది. కొన్ని రోజుల ఉత్సాహం తర్వాత సంకల్పాలు మసకబారిపోతాయి. నూతన సంవత్సరం మనకు గుర్తు చేయాల్సిన విషయం ఒకటేనిరంతర కృషి లేకుండా ఏ మార్పు నిలబడదు.వ్యక్తిగత జీవితంలో మార్పు ఎంత అవసరమో, సామాజిక బాధ్యత కూడా అంతే కీలకం. ప్రతి పౌరుడు తన చిన్న పాత్రను నిజాయితీగా నిర్వర్తిస్తేనే పెద్ద మార్పు సాధ్యం.

రోడ్డు మీద చెత్త వేయకపోవడం, చట్టాలను గౌరవించడం, ఇతరుల హక్కులను గుర్తించడం ఇవి చిన్న విషయాల్లా కనిపించినా, సమాజాన్ని బలపరిచే మూలస్తంభాలు.నూతన సంవత్సరం సమాజానికి మరో సందేశం ఇస్తుంది సహనం. అభిప్రాయ భేదాలు సహజం. కానీ అవి ద్వేషంగా మారితేనే సమస్యలు మొదలవుతాయి. పరస్పర గౌరవం, సంభాషణ, సహనమే ప్రజాస్వామ్యానికి బలం. కొత్త ఏడాది ఈ విలువలను మళ్లీ గుర్తు చేయాలి.యువతకు ఈ నూతన సంవత్సరం అత్యంత కీలకం. చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరుకుతుందా? నైపుణ్యాలు సరిపోతాయా? అనే ప్రశ్నలు యువతను వెంటాడుతున్నాయి. ఈ సమయంలో నిరాశకు లోనవకుండా, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం అవసరం. త్వరిత ఫలితాల కోసం కాకుండా, దీర్ఘకాల లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

విద్యా రంగంలోనూ నూతన సంవత్సరం ఆలోచనలకు దారి తీయాలి. చదువు మార్కులకే పరిమితం కాకుండా, జీవితానికి ఉపయోగపడే నైపుణ్యాల వైపు మళ్లాలి. ఆలోచన శక్తి, సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మకతఇవే రాబోయే కాలంలో యువతను నిలబెట్టే ఆయుధాలు.కుటుంబ వ్యవస్థ కూడా నూతన సంవత్సరంతో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. బిజీ జీవితాల్లో కుటుంబానికి సమయం తగ్గిపోతున్న వేళ, సంబంధాలను బలపరచుకోవడం అత్యవసరం. మాటలు, సమయం, అనుబంధం ఇవి లేకుండా కుటుంబం నిలబడదు. నూతన సంవత్సరం కుటుంబ విలువలను మళ్లీ గుర్తు చేసే రోజు కావాలి.ఆర్థిక పరంగా చూస్తే, కొత్త ఏడాది మరింత జాగ్రత్తను కోరుతోంది. ఆదాయం పెంచుకోవడమే కాకుండా, ఖర్చులను నియంత్రించడం కూడా అవసరం. అప్పుల ఊబిలో కూరుకుపోకుండా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పండుగ మాత్రమే కాదు, బాధ్యతల గుర్తింపు కూడా. ఆశలు మాటలకే పరిమితం కాకుండా చర్యలుగా మారినప్పుడే నిజమైన మార్పు కనిపిస్తుంది. వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ ప్రతి ఒక్కరూ తమ పాత్రను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే సమాజం ముందుకు సాగుతుంది.చివరగా, నూతన సంవత్సరం మనకు ఇచ్చే అతిపెద్ద అవకాశం మళ్లీ ప్రయత్నించడానికి ఉన్న స్వేచ్ఛ. గతం భారంగా కాకుండా మార్గదర్శకంగా మారాలి. ఆశలతో పాటు కట్టుబాటు, సంకల్పాలతో పాటు కృషి జతకలిసినప్పుడే ఈ సంవత్సరం నిజంగా అర్థవంతంగా మారుతుంది. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సానుకూల మార్పుకు నాంది కావాలని ఆకాంక్షిద్దాం.

# రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, వేద న్యూస్ :**

ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా కల్లూరు మండలంలో సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నీరజ ప్రభాకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.కల్లూరు మండలం నారాయణపురం కేంద్రంగా చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా, నారాయణపురం పేరువంచ రహదారికి రూ.2 కోట్లు, నారాయణపురం రామకృష్ణపురం రహదారికి రూ.4 కోట్లు, పేరువంచ కుప్పనకుంట్ల రహదారికి రూ.7 కోట్లు, కొత్త నారాయణపురం నుంచి ఎన్ఎస్పీ కెనాల్ లిఫ్ట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. ఈ రహదారుల నిర్మాణంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రహరీ గోడతో సహా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని రెండు నెలలలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.ప్రతి పల్లెకు వంద శాతం మౌలిక వసతులు కల్పించే వరకు ప్రభుత్వం విశ్రమించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని, వచ్చే ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

# చిరంజీవి సినిమాలో వెంకటేష్ పాత్రపై అనిల్ రావిపూడి లీక్..



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి ప్రస్తుతం టాప్ ఫామ్‌లో కొనసాగుతున్నారు. గత సంక్రాంతికి వెంకటేష్ హీరోగా తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఇండస్ట్రీ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న అనిల్, ఇప్పుడు అదే జోరుతో మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'మన శంకర్ వరప్రసాద్ గారు' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా 'మీసాల పిల్ల' పాట 100 మిలియన్ వ్యూస్‌ను దాటడంతో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. తాజాగా విడుదలైన చిరంజీవి వెంకటేష్ మాస్ పాట కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ పాటకు రీల్స్ చేస్తూ అభిమానులు తెగ సందడి చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పాట విడుదల సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ అనుకోకుండా ఓ ఆసక్తికర లీక్ ఇచ్చారు. సినిమా క్లైమాక్స్‌లో వెంకటేష్ పాత్ర ఎంట్రీ ఉంటుందని, దాదాపు 25 నిమిషాల పాటు ఆయన స్క్రీన్‌పై కనిపించి కథను మరో స్థాయికి తీసుకెళ్తారని అనిల్ వెల్లడించారు. అంతకుమించి వివరాలు చెబితే సినిమా థ్రిల్ పోతుందని చెప్పి అక్కడితో ఆపేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అనిల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఈవెంట్‌లో చిరంజీవి తనదైన స్టైల్‌లో వెంకటేష్‌తో కలిసి డ్యాన్స్ చేసి అభిమానులను ఉర్రూతలూగించారు. అనిల్ రావిపూడి ఎంటర్‌టైన్‌మెంట్ మార్క్‌కు చిరంజీవి మాస్ ఇమేజ్ తోడవడంతో ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, సంక్రాంతి బాక్సాఫీస్‌ను 'మన శంకర్ వరప్రసాద్ గారు' ఏ స్థాయిలో షేక్ చేస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

# ప్రభాస్,పవన్ మల్టీస్టారర్‌లో నిధి అగర్వాల్..


**వేద న్యూస్ డెస్క్:**



.'రాజా సాబ్' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న అందాల నటి నిధి అగర్వాల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ హారర్ థ్రిల్లర్ చిత్రంలో ముగ్గురు కథానాయికలలో ఒకరిగా నటించిన నిధి, 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా అభిమానులతో ముచ్చటించిన ఆమె, తమ ప్రశ్నలకు చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. ఇటీవల పవన్ కల్యాణ్ సరసన హరి హర వీరమల్లు చిత్రంలో కనిపించిన నిధి, ఇప్పుడు ప్రభాస్‌తో రాజా సాబ్‌లో నటించడం తనకు ప్రత్యేక అనుభూతి అని పేర్కొన్నారు. అభిమానులతో జరిగిన సంభాషణలో ఒకరు "తెలుగులో మీ డ్రీమ్ మల్టీస్టారర్ కాంబినేషన్ ఏది?" అని ప్రశ్నించగా, నిధి నవ్వుతూ "పవన్ కల్యాణ్ సర్, ప్రభాస్ సర్, నేనుడ దర్శకత్వం సందీప్ రెడ్డి వంగా" అని సమాధానం ఇచ్చారు. ఈ ఒక్క వాక్యం చాలు అన్నట్టుగా అభిమానుల్లో ఊహలకు రెక్కలు వచ్చాయి. ప్రభాస్‌పవన్ కలయికలో నిధి హీరోయిన్‌గా నటిస్తే ఎలా ఉంటుందోనని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. అంతేకాదు, అభిమానులతో సరదాగా మాట్లాడిన నిధి, వ్యక్తిగత ప్రశ్నలకూ హాస్యంగా స్పందించారు. బ్రేక్‌ఫాస్ట్‌కు ఎప్పుడు వస్తారు అని అడిగితే "రేపే డేట్" అంటూ నవ్వులు పూయించారు. డిన్నర్ ప్లాన్ గురించి అడిగిన మరో ప్రశ్నకు "మీరు ఎప్పుడు ప్లాన్ చేస్తారో చెప్పండి" అంటూ సరదాగా బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలతో నిధి సహజమైన వ్యక్తిత్వం మరోసారి బయటపడింది. ప్రభాస్ సినిమాల గురించి అడిగిన ప్రశ్నకు నిధి 'సలార్' తనకు ఎక్కువగా నచ్చిన చిత్రం అని చెప్పింది. ప్రభాస్‌ను దేశంలోనే అతిపెద్ద సూపర్ స్టార్‌గా అభివర్ణించిన ఆమె, పవన్ కల్యాణ్, ప్రభాస్ ఇద్దరూ తమ అభిమానులను అపారంగా ప్రేమించే వ్యక్తులని ప్రశంసించారు. నిధి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట హాట్ టాపిక్‌గా మారగా, అభిమానులు ప్రభాస్‌పవన్ మల్టీస్టారర్‌పై కలలు కంటూ స్పందిస్తున్నారు.

# వీయష్ 'టాక్సిక్' నుంచి నయనతార ఫస్ట్ లుక్ విడుదల

**వేద న్యూస్ డెస్క్**



.కేజీఎఫ్ సిరీస్ వంటి మెగా బ్లాక్‌బస్టర్ల తర్వాత కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్ ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. జాతీయ అవార్డు విజేత గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇప్పటికే కియారా పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందం, తాజాగా నయనతార ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సుకతను మరింత పెంచింది. ఈ సినిమాలో నయనతార 'గంగా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా, విడుదలైన పోస్టర్‌లో ఆమె లుక్ చాలా ఇంటెన్సివ్‌గా, గంభీరంగా కనిపిస్తోంది. యష్ సరసన నయనతార నటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ కాంబినేషన్‌పై భారీ హైప్ నెలకొంది. ముఖ్యంగా బలమైన పాత్రల ఎంపికలో పేరుగాంచిన నయనతార ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. కేజీఎఫ్ 2 తర్వాత యష్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీో చిత్రీకరిస్తుండగా, తరువాత తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేయనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వెంకట్ కె నారాయణ, యష్ కలిసి నిర్మిస్తున్నారు. నయనతార ఫస్ట్ లుక్ విడుదలతో 'టాక్సిక్'పై అంచనాలు మరింత పెరిగాయని చెప్పడంలో సందేహం లేదు.

# విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగనున్న ముగ్గురు స్టార్‌లు..

**వేద న్యూస్ డెస్క్:**

దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న విజయ్ హజారే ట్రోఫీ ఈసారి ప్రత్యేక ఆకర్షణగా మారింది. కేంద్ర కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ టోర్నీలు ఆడాలన్న బీసీసీఐ నిబంధనల నేపథ్యంలో ఇప్పటికే పలువురు సీనియర్ క్రికెటర్లు మైదానంలోకి దిగారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ తమ జట్ల తరఫున ఆడి అభిమానులను అలరించగా, ఇప్పుడు మరో ముగ్గురు స్టార్ ఆటగాళ్లు కూడా విజయ్ హజారేలో పాల్గొననున్నారని సమాచారం. టీమిండియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జనవరి తొలి వారంలో విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశముందని క్రికెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఉండటంతో, ఆ సిరీస్‌కు ముందే వీరు దేశవాళీ మ్యాచులు ఆడనున్నారు. పంజాబ్ జట్టు తరఫున శుభ్‌మన్ గిల్ జనవరి 3న సిక్కింకు, జనవరి 6న గోవాతో జైపూర్ వేదికగా జరిగే మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే అవకాశముంది. ఇప్పటికే పంజాబ్ జట్టు మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించగా, ఈ మ్యాచ్‌ల అనంతరం గిల్ నేరుగా జాతీయ జట్టుతో కలవనున్నాడు. సౌరాష్ట్ర తరఫున రవీంద్ర జడేజా జనవరి 6న సర్వీసెస్‌తో, జనవరి 8న గుజరాత్‌తో జరిగే మ్యాచ్‌ల్లో పాల్గొంటున్నట్లు సమాచారం. ఇప్పటివరకు సౌరాష్ట్ర జట్టు మూడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం మాత్రమే సాధించడంతో, జడేజా రాక జట్టుకు కీలకంగా మారనుంది. ఇక



కర్ణాటక జట్టు తరఫున కేఎల్ రాహుల్ జనవరి 3న త్రిపురతో, జనవరి 6న రాజస్థాన్‌తో జరిగే మ్యాచ్‌ల్లో ఆడే అవకాశముంది. అయితే దీనిపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం నుంచి ఇంకా అధికారిక ధృవీకరణ రాలేదు. కర్ణాటక జట్టు ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు సాధించి మంచి జోరులో ఉంది. ఈ ముగ్గురు స్టార్‌ల రాకతో విజయ్ హజారే ట్రోఫీపై అభిమానుల ఆసక్తి మరింత పెరిగింది. జాతీయ జట్టుకు ముందు కీలకమైన ఈ దేశవాళీ మ్యాచ్‌లు ఆటగాళ్ల ఫామ్‌ను మరింత పదును పెట్టే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# టాటా సుమో మళ్లీ రాబోతోందా?..

**వేద న్యూస్ డెస్క్:**



.దేశీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో వరుసగా కొత్త మోడళ్లతో దూసుకుపోతున్న టాటా మోటార్స్ మరోసారి చర్చకు కేంద్రంగా మారింది. ఇటీవల పాత మోడళ్లను ఆధునిక రూపంలో తిరిగి తీసుకొస్తున్న నేపథ్యంలో, ఒకప్పుడు రోడ్లపై రాజ్యమేలిన టాటా సుమో మళ్లీ వస్తుందా అనే ప్రశ్న వినియోగదారుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అధికారిక ప్రకటన లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం సుమో కొత్త అవతారానికి సంబంధించిన డిజైన్ చిత్రాలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల టాటా పాత మోడళ్లను ఆధునిక ఫీచర్లతో రీ ఎంట్రీ చేయడంతో, అదే తరహాలో సుమోను కూడా తిరిగి తీసుకురావచ్చనే అంచనాలు బలపడుతున్నాయి. ప్రస్తుతం ఈ విభాగంలో టాటాకు ప్రత్యేకంగా బాక్సీ స్టైల్ మల్టీ పర్పస్ వాహనం లేకపోవడంతో, సుమో రీఎంట్రీ జరిగితే మార్కెట్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని ఆటో నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది డిజైనర్లు కృత్రిమ మేధస్సు సహాయంతో సుమోను ఆధునిక ఎస్‌యూవీగా పున'రూపకల్పన చేశారు. వైరల్ అవుతున్న ఈ డిజైన్లలో పాత సుమోకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన బాక్సీ ఆకృతిని అలాగే ఉంచుతూ, కొత్త తరం స్పేర్ వీల్‌ను వెనుక భాగంలో అమర్చడం ద్వారా పాత సుమో గుర్తింపును కొనసాగించారు. అంతర్గతంగా చూస్తే నాలుగు స్పోక్ స్టీరింగ్ వీల్, రోటరీ గేర్ నాబ్, పెద్ద టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సీటు వెంటిలేషన్ వంటి ఆధునిక సౌకర్యాలు ఊహాత్మకంగా చూపించారు. ఈ డిజైన్లను ఒక ఆటో డిజైనర్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకోవడంతో, నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. టాటా సుమో తిరిగి వస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విస్తృతంగా ఆదరణ లభిస్తుందని, ఇది కుటుంబ వాహనంగా, వాణిజ్య అవసరాలకూ ఉపయోగపడుతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఊహాగానాలే అని, సుమో రీఎంట్రీపై టాటా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదని స్పష్టంచేయాలి. అయినప్పటికీ, నెట్టింట సాగుతున్న ఈ చర్చలు చూస్తే సుమోపై ఉన్న క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది.


# 6 కిలోలు తగ్గిన శ్రేయాస్ అయ్యర్..

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి రావడం మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపి స్తున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా గాయ పడిన ఆయన ఇంకా పూర్తిగా కోలుకోలేదని తెలుస్తోంది. క్యాచ్ అందుకునే ప్రయత్నంలో కిందపడిన సమయంలో కడుపు భాగంలో తీవ్ర దెబ్బ తగలడంతో ప్లీహం దెబ్బతిని రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఆ తర్వాత ఆయనకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఈ శస్త్రచికిత్స అనంతరం శ్రేయాస్ అయ్యర్ సుమారు 6 కిలోల బరువు తగ్గినట్లు సమాచారం. మాంసకణజాలం తగ్గడం వల్ల బరువు వేగంగా పడిపోయిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నప్పటికీ, దీర్ఘకాలం మైదానంలో గడపాల్సిన 50 ఓవర్ల ఫార్మాట్‌కు శారీరకంగా సిద్ధంగా ఉన్నాడా లేదా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో జనవరి 3, 6 తేదీల్లో జరిగే మ్యాచ్‌ల్లో శ్రేయాస్ ఆడే అవకాశం ఉందని తొలుత ప్రచారం జరిగినా, తాజా పరిస్థితుల్లో అది కూడా ఖరారుగా లేదని తెలుస్తోంది. ముఖ్యంగా కడుపు శస్త్రచికిత్స అనంతరం ఎక్కువసేపు ఫీల్డింగ్ చేయడం, డైవ్స్ వేయడం వంటి అంశాలపై బీసీసీఐ వర్గాలు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు శ్రేయాస్ అందుబాటులో ఉంటాడా లేదా అన్నది పూర్తిగా అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించినప్పటికీ, పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని సమాచారం. దీంతో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ ఆడటం డౌటుగానే మారింది.

# న్యూజిలాండ్ సిరీస్‌కు షమీ?



**వేద న్యూస్ డెస్క్:**

.గత కొన్ని నెలలుగా జట్టుకు దూరంగా ఉన్న అనుభవజ్ఞుడైన పేసర్ మహమ్మద్ షమీ విషయంలో సెలెక్టర్లు కీలక నిర్ణయం తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఫిట్‌నెస్, వయస్సు, భవిష్యత్తుపై అనుమానాల నడుమ ఉన్న షమీ పేరు తాజాగా మళ్లీ జాతీయ జట్టు ఎంపిక చర్చల్లోకి వచ్చింది. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని అనుభవం ఉన్న బౌలర్లను కొనసాగించాలనే ఆలోచనలో భాగంగా షమీ రీఎంట్రీపై గంభీరంగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. బీసీసీఐ వర్గాల ప్రకారం, షమీ పూర్తిగా రేసు నుంచి తప్పుకోలేదని స్పష్టత వచ్చింది. ఫిట్‌నెస్ ఒక్కటే ప్రస్తుతం ఆందోళనకర అంశమని, కానీ వికెట్లు తీసే సామర్థ్యం, మ్యాచ్‌లను మలుపు తిప్పే అనుభవం అతడికి ఇప్పటికీ ఉన్నాయని సెలెక్టర్లు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. దేశవాళీ క్రికెట్‌లో అతడు చూపిస్తున్న ప్రదర్శన కూడా షమీకి అనుకూలంగా మారింది.

# క్రెడిట్ కార్డ్ యూజర్లకు బిగ్ అలర్ట్..

**వేద న్యూస్ డెస్క్:**



.రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్, ప్రత్యేక ఆఫర్ల కోసం చాలా మంది క్రెడిట్ కార్డులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. సక్రమంగా వాడితే ఇవి లాభదాయకంగా మారుతాయి. కానీ అదుపు తప్పితే మాత్రం ఇవే భారీ పన్ను సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆదాయపు పన్ను శాఖ ఇప్పుడు క్రెడిట్ కార్డు లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కొంతమంది తమ స్నేహితులు లేదా బంధువుల ఖర్చులను తమ కార్డులతో చెల్లించి రివార్డు పాయింట్లు సంపాదిస్తున్నారు. ఆ తర్వాత ఆ మొత్తాన్ని నగదు లేదా యూపీఐ ద్వారా తిరిగి తీసుకుంటున్నారు. బయటికి ఇది ఖర్చులా కనిపించినా, వాస్తవంగా అది నిజమైన వినియోగం కాకపోవచ్చు. ఇలాంటి లావాదేవీలను పన్ను శాఖ కల్పిత ఖర్చులుగా పరిగణించే అవకాశం ఉంది. మీ ఆదాయపు పన్ను రిటర్న్‌లో చూపిన ఆదాయం తక్కువగా ఉండి, అదే సమయంలో క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్‌లో ఖరీదైన ప్రయాణాలు, విలాస వస్తువుల కొనుగోళ్లు, భారీ షాపింగ్ కనిపిస్తే వెంటనే అనుమానం వ్యక్తమవుతుంది. ఆధునిక డేటా విశ్లేషణల ప్రశ్నలు తలెత్తవచ్చు. అందుకే క్రెడిట్ కార్డులను వినియోగించే సమయంలో జాగ్రత్త అవసరం. రివార్డుల కోసం అసలు అవసరం లేని ఖర్చులు చేయడం, లావాదేవీలను గందరగోళంగా ఉంచడం చివరికి ప్రయోజనాల కంటే పన్ను భారం పెంచే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073